క్లుప్తంగా

ఉచిత శిక్షణ శిబిరం

చర్ల: రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన వేసవి సెలవులు ఉచిత శిక్షణా శిబిరాన్ని చర్ల ఎస్సై కేశవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ డీఎస్ కుమార్, డాక్టర్ ప్రతిభ ఏజెన్సీ ప్రాంతంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు కంప్యూటర్ కోచింగ్, క్రికెట్ ప్రాక్టీస్, కుట్టు శిక్షణలో తర్ఫీదునిచ్చేందుకు శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కంప్యూటర్, క్రికెట్, కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ వర్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పురప్రముఖులు పోలిన రాముడు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, నీలి నందు,ఎస్ కే షాజహాన్, సివి రమణ, మాతా రమణయ్య, జవ్వాది రవికుమార్, హరిచరణ్, భారతి ప్రోగ్రాం కోఆర్డినేటర్స్,ఎంపీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దుమ్ముగూడెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుమ్ముగూడెం వైద్యాధికారి పుల్లారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని అచ్చితాపురం గ్రామంలో ఎటువంటి లక్షణాలు లేకుండా మలేరియా కలిగి ఉండుట ఫివర్ సర్వేను నిర్వహించారు. గ్రామంలోని 222 మందికి రక్త పరీక్షలను నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఆశా కార్యకర్త రమణ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగుకు చెందిన యువకుడు బండి అనిల్ ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ఈమేరకు అనిల్‌తో కలిసి 2004-05లో పదో తరగతి చదివిన స్నేహితులు శనివారం ఆయన భార్యాపిల్లలకు రూ.35వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన ఇంటిలిజెన్స్ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్ కూడా రూ.5వేల నగదు, 50 కేజీల బియ్యం అందించారు.

పెద్దిపల్లిలో జ్వరసర్వే

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన పెద్దిపల్లిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అసింప్టోమెటిక్ జ్వర సర్వేను నిర్వహించారు. సర్వేలో భాగంగా వైద్యసిబ్బంది ప్రతీ గృహాన్ని సందర్శించి అనుమానితుల నుంచి రక్తనమూనాలను సేకరించి ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్ చేశారు. మొత్తం 117మందికి పరీక్షలు చేయగా..ఏ ఒక్కరికి మలేరియా సోకలేదని వైద్యసిబ్బంది నిర్ధారించారు. కార్యక్రమంలో హెచ్ఈ పరంగిని, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, శైలజ, ఆశా వర్కర్లు రోజా, పుష్ప, రాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

అశ్వారావుపేటరూరల్: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం పట్ల ఆయా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్ వేలుగోటి శేషబాబును ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, దారా మల్లికార్జున్ రావు, బీఆర్ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్ రావు, సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, సంకా ప్రసాద్, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

యర్రయ్య రెడ్డి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

భద్రాచలం: భద్రాచలం మాజీ శాసనసభ్యుడు, ఆదివాసీ ఉద్యమనేత ముర్ల యర్రయ్య రెడ్డి ఆశయ స్ఫూర్తితో గిరిజన హక్కుల సాధనకు ఉద్యమిద్దామని పలువురు ఆదివాసీ సంఘ నాయకులు పేర్కొన్నారు. ముర్ల యర్రయ్య రెడ్డి వర్ధంతిని శనివారం పట్టణంలోని పాత మార్కెట్ సెంటర్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో భద్రాచలం ఆదివాసీ సమితి కార్యదర్శి పాయం రవి వర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యర్రయ్య రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఆయన ఆశయ సాధనకు ఉద్యమించటమే ఆయనకు నివాళి అని అన్నారు. భద్రాచలం ఆదివాసీ సమితి అధ్యక్షుడు పూనెం కృష్ణ దొర, ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షుడు కుంజా శ్రీను, ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్, రాజేందర్, సూత్రు రామారావురెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట ప్రభుత్వ పాఠశాలలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. 65 మంది గ్రామస్తులకు శనివారం ఏరియా ఆస్పత్రి వైద్యులు శేష గిరిరావు బీపీ, షుగర్ బాధితులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఓసీ మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి భాస్కర్‌రావు, స్టాఫ్ నర్స్ భవానీ, నాగసాయి, భానుప్రసాద్, రాజుపేట ఆశ వర్కర్ భుక్యా గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రమూకల దాడికి నిరసన

- వ్యాపార సముదాయాలు, దుకాణాల బంద్
- వీధుల్లో నినాదాల మధ్య ర్యాలీలు
- పాల్గొన్న ముస్లింలు, పలు సంఘాల నాయకులు



చంద్రుగొండ: జేఐహెచ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అశ్వారావుపేటరూరల్: బంద్‌తో అశ్వారావుపేటలో మూతబడిన వ్యాపార సంస్థలు



చర్లలో శాంతి ర్యాలీ..

అశ్వారావుపేటరూరల్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా శనివారం అశ్వారావుపేటలో బంద్ పాటించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అన్ని వ్యాపార సంస్థలు బంద్ చేయగా, దుకాణాలు మూతపడ్డాయి. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా శ్రీ పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, ముస్లిం మైనారిటీ సంఘం బాధ్యులంతా కలిసి జాతీయ జెండాలను పట్టుకుని నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఆదర్శ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో..

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా శనివారం అశ్వారావుపేటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే రెండు నిమిషాలు మౌనం పాటించి, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కూనా శ్రీనివాస్, సభ్యులు తాడేపల్లి సిద్ధారావు, ఎస్‌కె.మౌలాలి, పచ్చా సత్యనారాయణ, ఆరేపల్లి సాంబశివరావు, వేముల భగన్ననారాయణ, చింతయ్య, కొనకళ్ల శ్రీను, సత్యనారాయణ, ఎస్ఎస్ ప్రసాద్, నమ్మయ్య, వెంకన్నబాబు పాల్గొన్నారు.

చర్ల: కాశ్మీర్‌లోని పెహల్కామ్‌లో ఉగ్రమూకలు జరిపిన దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ వారికి సంతాపం తెలియజేస్తూ శనివారం చర్లలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు.

చంద్రుగొండ: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రఘటనపై మండలకేంద్రం చంద్రుగొండలో శనివారం రాత్రి మాల మహానాడు, జామాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. కశ్మీర్ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఆందోళనలకు యండి.షబ్బీర్‌హుసేన్, రాయి రాజా, బడుగు శంకర్, బడుగు వెంకటేశ్వర్లు, యండి.అశ్రఫ్‌హుసేన్ నాయకత్వం వహించారు.

ఛత్తీస్‌గఢ్ వలసవాదుల సర్వే

భద్రాచలం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలసవచ్చిన వారి వివరాలను సేకరించేందుకు ఆ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కల్యాణ సింగ్ శనివారం ఐటీడీఏ ప్రాజెక్ట్ బి.రాహుల్‌ను ఛాంబర్‌లో కలిశారు. వలసవాదులు ఎక్కడ నివసిస్తున్నారు, ఎలా ఉన్నారు, తిరిగి స్వరాష్ట్రానికి వస్తారా.. తదితర వివరాలను ఆరా తీయడానికి వచ్చినట్లు పీఓకు వివరించారు.

ఈ సందర్భంగా పీఓ రాహుల్.. బృందం సభ్యులకు కొన్ని సూచనలు ఇచ్చారు. వలస వచ్చిన వారు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎక్కువ శాతం పల్లె ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని, కోయ తెగలతోపాటు గొత్తికోయలు కలిసిపోయినట్లు వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వలసదారులను నేరుగా కలిసి విచారణ చేయడానికి ఛత్తీస్‌గఢ్ బృందంతోపాటు ఐటీడీఏ తరుపున జూనియర్ అసిస్టెంట్‌ను పీఓ పంపించారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, బృందంలోని సభ్యులు రవీంద్ర టిక్కీ, ధీరజ్ నాగ్ తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీఓతో చర్చిస్తున్న ఛత్తీస్‌గఢ్ అధికారులు

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ తాతారావు

బూర్గంపాడు: రైతులు సేంద్రియ సాగు విధానంపై దృష్టి పెట్టాలని మణుగూరు వ్యవసాయ డివిజన్ ఏడీఏ తాతారావు సూచించారు. సోంపల్లి గ్రామంలో గాదె నర్సిరెడ్డి అనే రైతు సేంద్రియ విధానంలో వరికొయ్యలు కాల్చకుండా నీరు పెట్టి భూమిలో కలియదున్నే కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ సాగు చేపట్టాలన్నారు. రసాయనిక మందులతో భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని, పంటలకు మేలు చేసే భూమిలోని జీవరాశులు నశిస్తున్నాయన్నారు. సేంద్రియ సాగుతో భూసంరక్షణ జరుగుతుందని, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చని అన్నారు. భూములకు వేసవిలో పశువుల పేడ వేసుకోవాలని, తొలకరిలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. చెరువు పూడిక మట్టిని పొలాల్లో తోలుకోవాలన్నారు. వేసవి దుక్కులు దున్ని కలుపు నివారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శంకర్, ఏఈఓ వైష్ణవి, బత్తుల రామకొండారెడ్డి, తోకల అనిత, కైపు లక్ష్మీనారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, బోరం శ్రీనివాస్, బొబ్బల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సబ్ జైల్‌ను శనివారం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశానుసారం, భద్రాచలం సబ్ జైల్‌లో ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, ఆహారానికి సంబంధించి మెను గురించి ఆరా తీశారు. ఇదే విధంగా ప్రతి నెలా సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జైలర్ ఉపేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సబ్‌జైలులో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న భద్రాచలం న్యాయమూర్తి శివనాయక్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే అడ్డగింత



సర్వే అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ విషయం గ్రామాల్లో గలిబిలి చోటుచేసుకుంటోంది. మండలంలోని పోకలగూడెం పంచాయతీ బాల్యతండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు శనివారం వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. అర్హుల జాబిత 319 ఉండగా పంచాయతీకి 61 ఇళ్లు మాత్రమే మంజూరు కావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే ప్రత్యేకాధికారిని అడ్డుకున్నారు. తొలివిడతగా మంజూరు చేసిన జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే అనంతరం అనర్హులు ఉంటే జాబితా నుంచి తొలగిస్తామని ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు చెప్పినా గ్రామస్తులు వినిపించుకోలేదు. ఈ క్రమంలో ప్రత్యేకాధికారి వెనుదిరాగారు. అనంతరం గ్రామస్తులు చంద్రుగొండ చేరుకుని ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేకు సహకరించాలని, సర్వే చేస్తేనే అనర్హులెవరో స్పష్టమౌతుందని ఎంపీడీఓ వారికి సూచించారు.

కార్మికులకు జీవిత బీమా

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ గ్రామపంచాయతీ కార్మికులకు జీవిత బీమా చేయించింది. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బీమా పట్టాలను ఎంపీడీఓ జమలారెడ్డి చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు చేయూత ట్రస్ట్ జీవితబీమా చేయించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. మిగతా గ్రామపంచాయతీలలో కూడా పారిశుద్ధ్య కార్మికులకు జీవిత బీమా చేయించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు భవాని, విజయ్, ఏపీఓ విజయలక్ష్మి, ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, కొండ్రు వెంకటేశ్వర్లు, కై పు నాగిరెడ్డి, మల్లారెడ్డి, రాజేశ్, నర్సిరెడ్డి, కిషన్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లో ఓల్టేజీని నివారించాలి

దుమ్ముగూడెం: మండలంలో పలు గ్రామాలలో ఉన్న లోఓల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు ఏఈ మోహన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామాల ప్రజలు ఎన్నో రోజులుగా లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరాలో నిరంతర అటంకాలు సంభవిస్తున్నాయని, దీంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారవేత్తలు తీవ్ర అసౌకర్యానికి వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, ఉపాధ్యక్షులు తెల్లం హరికృష్ణ, మెట్టుపల్లి నటరాజ స్వామి,నాయకులు శిరపు అప్పలరెడ్డి, టీపీసీసీ మీడియా-కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ కనుబుద్ధి దేవా, డింగి సందీప్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సభకు కదలిరావాలి

భద్రాచలంఅర్బన్: బీఆర్ఎస్ 25 సంవత్సరాల రజతోత్సవ సభకు భద్రాచలం మండల పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. శనివారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ కోకన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు, సీనియర్ నాయకులు కొల్లం జయ ప్రేమ్ కుమార్, నాయకులు సీతామహాలక్ష్మి, మురలా డానియల్ ప్రదీప్, చిట్టిమల్ల అనిల్ కుమార్ ఉన్నారు.

పార్టీ జెండా ఎగురవేత..

దుమ్ముగూడెం: మండలంలోని గ్రామగ్రామాన గులాబి జెండా ఎగురవేయాలని భద్రాచలం పార్టీ నియోజకవర్గ బాధ్యులు మానే రామకృష్ణ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని దుమ్ముగూడెం, కమాలాపురం గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానిపాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జెండాలు తొలగించాలి

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చుట్టూ గులాబీ పార్టీ జెండాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, మాలమహానాడు సంఘాల నాయకులు శనివారం రహదారితో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని దళిత సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు, ఎస్సై మేడ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు, ఎస్సై మేడ ప్రసాద్ ఘటన ప్రాంతానికి చేరుకుని ఆందోళన కారులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న గులాబీ పార్టీ జెండాలను, తోరణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము హుస్సేన్, విజయ లక్ష్మి, ఉసికెల కొండయ్య, వెంకటేశ్వర్లు, మాలమహానాడు నాయకులు నరేష్ పాల్గొన్నారు.



ఆందోళన కారులకు నచ్చజెబుతున్న ఎస్సై మేడ ప్రసాద్

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. అదనపు ఎస్సై రామ్మూర్తి కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెద్దరావిగూడేనికి చెందిన కొనకళ్ల ఏసులక్ష్మి(40) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె కొద్ది నెలలుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ఇంట్లో కేర్ టేకర్‌గా పని చేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీలోని నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎస్‌కే రియాజ్‌తో పరిచయం కాగా, వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఈ విషయం కుటుంబీకులకు తెలియడంతో శుక్రవారం పెదరావిగూడెం వచ్చిన ఆమెను నిలదీశారు. దీంతో మనస్తాపం చెంది అశ్వారావుపేట మండలం బండారుగూడెం గ్రామంలోని తన మేనమామ ఇంటికి వచ్చి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై తెలిపారు.

గ్రావెల్ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

చర్ల: మండలంలోని దానవాయిపేట సమీపంలో ఉన్న ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తుండగా గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. మండలంలోని తేగడ గ్రామ పంచాయతీ ఎర్రగడ్డలో ఏర్పాటు చేస్తున్న ఇసుక క్వారీకి రోడ్లు నిర్మించేందుకు దానవాయిపేట సమీపంలోని తాలిపేరు ప్రధాన కాలువ పక్కన గల ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో నుంచి రెండు టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలిస్తున్నారు. దీంతో ఆర్ కొత్తగూడెం, దానవాయిపేట గ్రామాల ప్రజలు అడ్డుకుని అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో చర్ల రేంజ్ అధికారి బి.ద్వాలియా సిబ్బందిని పంపించి లారీలను రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో నుంచి గ్రావెల్ తరలించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

చంద్రుగొండ: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని మద్దుకూరుకు చెందిన పద్దం భద్రమ్మ(87) ఈనెల 24న అదే గ్రామంలో ఉండే సోదరి ఇంటికి వెళ్లివస్తుండగా ప్రవీణ్‌కుమార్ బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కొత్తగూడెంకు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిచస్తుండగా శనివారం రాత్రి మృతి చెందింది. భద్రమ్మ కోడలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లుఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

భద్రాచలం పోలీసులకు రివార్డు



ప్రశంసా పత్రాలతో పోలీసులు

భద్రాచలం అర్బన్ : భద్రాచలం పోలీసులకు రివార్డ్ లభించింది. మూడు రాష్ట్రాలకు అనుబంధమైన భద్రాచలం చెక్ పోస్టు మీదుగా గంజాయి తరలి వెళ్లకుండా అరికట్టడంలో ప్రతిభ చాటిన ఎస్ఐలు విజయలక్ష్మి, మధుప్రసాద్, సిబ్బంది భాస్కర్, సురేందర్‌లను పోలీస్ శాఖ డీజీపీ రివార్డుతో అభినందించారు. రివార్డుకు జిల్లా నుంచి 35 మంది పోలీసు అధికారులు ఎంపికకాగా, వారిలో భద్రాచలం నుంచి నలుగురు ఉన్నారు.

ప్రభుత్వ బడిలో వేసవి తరగతులు

దమ్మపేట: మండలంలోని వెంకటాద్రిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల్లో ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించుటకు ప్రత్యేక వేసవి తరగతులను నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు విద్యార్థులకు ఉపయోగపడేలా.. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్ విద్యార్థుల తల్లిదండ్రుల ఆమోదంతోనే రాతలో నైపుణ్యాలు, ప్రాథమిక గణితంలో మెళకువలపై ప్రైవేటు ఉపాధ్యాయుడితో 15 రోజులపాటు ప్రత్యేక వేసవి తరగతులను శనివారం నుంచి ప్రారంభించారు. వేసవి తరగతుల నిర్వహణకు అయ్యే వ్యయానికి ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులను సమకూర్చనున్నారు.



ప్రాథమికోన్నత పాఠశాలలో నైపుణ్యాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సీపీఐ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా శివాజీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీపీఐ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా మా రెడ్డి శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్‌పీఎస్ నాయుడు అధ్యక్షతన జరిగిన పట్టణ ముఖ్య కార్యకర్తల అత్యవసర సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఏఐటీయూసీ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా కంభం మెట్టు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా గుంజా రామారావు, మహిళా సమాఖ్య పట్టణ తాత్కాలిక కన్వీనర్‌గా బైరు వరలక్ష్మిలను కూడా పట్టణ కమిటీ ఎన్నుకుంది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మీసాల భాస్కరరావు, ఏపూరి వెంకటేశ్వరరావు, మహేష్, త్రిమూర్తులు, వెంకన్న, శోభన్, సీతారామరాజు, వెంకటమ్మ, రమణమ్మ, జ్యోతి,అజీమ్, చంటి, వెంకట రావు, సతీష్ కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.